

# ఫలించిన పోరాటం

◆శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విరమణ

◆రెండు నెలల వేతనాలు, ఏడు నెలల పిఎఫ్ చెల్లింపు

**ప్రజాశక్తి-అనంతపురం**

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెను విరమించారు. నాలుగు నెలల వేతనాలు, బకాయి ఉన్న పిఎఫ్ చెల్లించాలని కోరుతూ గత వారం రోజులుగా వాటర్ వర్కర్స్ సమ్మెలోనున్నారు. దీంతో తాగునీటి సరఫరాలోనూ సమస్య తలెత్తిందింది. ఈ నేపథ్యంలో మంగళవారం నాడు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రధాన పంపింగ్ స్టేషన్ పిఎబిఆర్ డ్యామ్ వద్ద సమ్మెలో ఉన్న కార్మికుల వద్దకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, డిఇలు వెళ్లి చర్చలు జరిపారు. రెండు నెలల వేతనాలు, ఏడు నెలల బకాయి పిఎఫ్‌ను వెంటనే చెల్లిస్తామని చెప్పారు. ఆ విధంగా వేతనాలు చెల్లించారు. తక్కిన రెండు నెలల వేతనాలు, పిఎఫ్‌ను వచ్చే నెల ఏడవ తేదీలోపు వేస్తామని లిఖితపూర్వకంగా హామీనిచ్చారు. సమ్మెను తక్షణం విరమించాలని అధికారుల అభ్యర్థన మేరకు కార్మికులు సమ్మెను విరమించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు మాట్లాడుతూ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసారని తెలిపారు. కార్మికుల సమిష్టి పోరాట ఫలితంగా బకాయి వేతనాలను సాధించుకోగలిగామని చెప్పారు. పోరాటంలో పాల్గొన్న కార్మికులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# అధికార ట్యాక్సులు వేరయా..!



◆ట్యాక్సుల్లో నేతల పన్ను సప'రేటు'..!

◆నిర్మాణం జరిగితే ముట్టజెప్పాల్సిందే..

◆లేకుంటే నిర్మాణాలు ఆగాల్సిందే

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

సాధారణంగా ఏమైనా నిర్మాణాలు చేపట్టాలంటే ప్రభుత్వానికిగానీ, స్థానిక సంస్థలకుగానీ ట్యాక్సు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనంతపురం నగరంలో మాత్రం నేతల ట్యాక్సులు చెల్లించాల్సి వస్తోంది. ఏ భవన నిర్మాణం జరిగినా ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్సులు చెల్లించినప్పటికీ స్థానిక నేతల ట్యాక్సులు చెల్లించాల్సి వస్తోంది. వారివారి స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రధానంగా నగర పాలక సంస్థ పరిధిలోనున్న అధికార పార్టీ కార్పొరేటర్లు కొందరు ఇదే పని మీద ఉన్నట్టు ఆరోపణలున్నాయి. నిర్మాణం చేపట్టేది అధికారపార్టీకి సంబంధించిన వారైనా సరే తమ ట్యాక్సు మాత్రం కట్టాల్సిందే. లేకపోతే మధ్యలోనే నిర్మాణాలు ఆపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవలి కాలంలో ఇటువంటి ఘటన ఒకటి చోటు చేసుకుంది.

**ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నా పైసలివ్వాల్సిందే...**

అనంతపురం నగరంలోని సాయినగర్ నర్సింగ్ హోం నిర్మాణం జరుగుతోంది. ఆ నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి స్థానిక నేతల నుంచి ఇబ్బందులు తప్పలేదు. నిర్మాణం కోసం బోరు వేసే సమయంలోనే నేతలు అక్కడికి చేరుకున్నారు. తమ ట్యాక్సు కట్టకుండా బోరు ఏ రకంగా వేస్తారంటూ అడ్డుకున్నారు. చివరకు చేసేది లేక కొంత మొత్తాన్ని ముట్టజెప్పారు. నిర్మాణాలు సైతం కొనసాగించారు. ఇక తాజాగా అదే భవనానికి సంబంధించి విద్యుత్ సరఫరా కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటు కోసం పనులు చేపట్టారు. రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ పెట్టినందుకు కూడా తనకు ట్యాక్సు కట్టాల్సిందేనని పట్టుబట్టినట్టు సమాచారం. ఇలా ప్రతి అంశంలోనూ డబ్బులు ఇవ్వాల్సి రావడం పట్ల నర్సింగ్ హోం యజమానులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. సమస్యను ముఖ్య నాయకుడి వరకు తీసుకెళ్లే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. దీనిపై నిఘా వర్గాలు సైతం వివరాలు సేకరించే పనిలోపడ్డాయి. ఇలా నగరంలో అనేక చోట్ల నేతల వసూళ్ల పర్వం కొనసాగుతోంది. ఇక పెద్ద భవనాలకైతే లక్షల్లోనే ముట్టజెప్పాల్సి వస్తోంది.

**అభివృద్ధి పని అయినా అంతే..**

ఇక అభివృద్ధి పనులకు సైతం పర్సంటేజీలు ఇచ్చుకోవాలి. లేకుంటే తమ డివిజన్ పరిధిలో అయినా పని చేయడానికి వీల్లేదు. విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి జెఎన్‌టియుకు వెళ్లే దారిలో పర్సంటేజీలివ్వలేదని గతంలో బాహాటంగానే కాంట్రాక్టరుతో గొడవ పడిన ఘటనలూ ఉన్నాయి. వారికి ముందుగా పది శాతమైనా చెల్లించాలి. అదేమంటే 'తాము ఎన్నికల్లో లక్షల్ల ఖర్చు పెట్టుకున్నాం. ఇక దాన్ని రికవరీ చేసుకోవాల్సిందే కదా' అని బాహాటంగానే చెబుతుండటం గమనార్హం. ఇలా ప్రతి పనికీ ఎంతోకొంత ముట్టజెప్పనిదే ముందుకు కదలదు. ప్రజలకు సేవ చేసేందుకు ప్రజాప్రతినిదులను ఎన్నుకుంటే వీరు చేసే పని మాత్రం ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. సొంత పని జరగాలన్నా, అభివృద్ధి పనులు జరగాలన్నా వీరి అనుమతులు మాత్రం తప్పనిసరిగా ఉండాల్సిందే.

**ఆందోళనకరంగా**

# పోలా రామాంజినేయులు ఆరోగ్యపరిస్థితి

## వెంటిలేటర్‌పై చికిత్స



పోలా రామాంజినేయులు

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడు పోలా రామాంజినేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఆయన అనంత పురంలోని సన్‌రే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత కొంతకాలంగా ఆయన మెడనొప్పి వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికి తోడు షుగర్, గ్యాస్ సమస్యలు తీవ్రం కావడంతో గత వారం రోజుల క్రితం అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. సమస్య తీవ్రం కావడంతో వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్సలు అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగ పోలా రామాంజినేయులు చేనేత రంగ సమస్యలపై నిరంతర పోరాటం సాగించారు. హ్యాండ్‌లూమ్ పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించారు. చేనేత కార్మికులను ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను చేశారు. సిపిఎంలోనూ ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం సాగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగానూ పని చేశారు. జిల్లాలో 57 వేల చేనేత కుటుంబాల జీవనం, సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తుల్లో పోలా రామాంజినేయులు ప్రముఖులు. చేనేత, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగించిన పోలా రామాంజినేయులు ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకోవాలని సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ కోరారు.



అనంతపురంలో సంగ్రామ సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు

# అనంతకు చేరిన ఎస్ఎఫ్ఐ సంగ్రామ సైకిల్ యాత్ర

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రభుత్వ విద్య, విద్యార్థుల సమస్యల పరిష్కారంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంగ్రామ సైకిల్ యాత్ర మంగళవారం సాయంత్రం అనంతపురానికి చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 450 కిలో మీటర్ల మేర యాత్ర సాగింది. అన్ని ప్రాంతాల్లో నాయకులు విద్యార్థులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలమూలలుగా సాగిన యాత్ర మంగళవారం రాత్రి అనంతపురం చేరుకుంది. బళ్లారి రోడ్డులోకి ఎస్ఎఫ్ఐ సంగ్రామ సైకిల్ యాత్ర ప్రవేశించిన సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై అనంతపురం జిల్లాలో 450 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. బుధవారం నాడు అనంతపురం సప్తగిరి సర్కిల్లోని కెఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభలో విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పూర్వపు నాయకులు డాక్టర్ నగరూరు రసూల్, నారాయణస్వామి, రవిచంద్ర, ఆంజనేయులు, ఉమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, శివ, గిరి, రజిత, సుచిత్ర పాల్గొన్నారు.

# అవయవదానం చేసి.. సోదరుని ప్రాణం నిలిపి...!

◆రక్షా బంధనానికి సరైన అర్థం ◆కిమ్స్ సవీరలో విజయవంతంగా కిడ్నీ మార్పిడి

**ప్రజాశక్తి-అనంతపురం**




అవయవదానం చేసిన యువతితో కిమ్స్‌సవేరా వైద్యులు

శ్రావణ మాస పౌర్ణమి రోజున భారతీయులు చేసుకునే పండగ రక్షాబంధనం. అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ముల క్షేమం కోరుతూ, వారు కలకాలం చల్లగా ఉండాలని దీవిస్తూ వారి చేతికి రక్షాబంధనం కడతారు. ఆ బంధనం వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. తమ సోదరులకు ఎలాంటి ఆపదా రాకూడదని, వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని అక్కాచెల్లెళ్లు ఆకాంక్షిస్తారు. ఇది ఒక్క రాఖీ పండుగ రోజు మాత్రమే కాదు.. జీవితాంతం తమ సోదరులు బాగుండాలన్న ఆకాంక్షతో కొందరు సోదరీమణులు తమ శరీర భాగాలను సైతం వారికి దానం చేసి రక్షాబంధన్‌కు నిజమైన అర్థాన్ని ఇస్తున్నారు. తమ సోదరుడు చావుబతుకుల్లో ఉన్నప్పుడు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, తమ శరీర అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. కాలేయంలో కొంత భాగాన్ని దానం చేసినవారు కొందరైతే, తమకున్న రెండు మూత్రపిండాల్లో ఒకదాన్ని ఇచ్చేసినవారు మరికొందరు. ఆ స్ఫూర్తిదాయక విషయాలు కొన్నింటిని ఇప్పుడు తెలుసుకుందాం.

**చెల్లి గొప్ప మనసు అన్న ప్రాణం కాపాడింది..**

రాయదుర్గం ప్రాంతానికి చెందిన వీరభద్ర (35) వత్తిరీత్యా వీడియో ఎడిటర్. సాధారణ జీవితాన్ని ఆస్వాధిస్తున్న సమయంలో ఈయనకు కుడివైపు మూత్రపిండం పూర్తిగా పాడైపోయింది. చాలా కాలంగా డయాలసిస్ మీద ఉన్నారు. ఎప్పటికైనా ఆ మూత్రపిండాన్ని మార్చాల్సిందేనని వైద్యులు చెప్పారు. ఎలా చేయించుకోవాలి. ఎవరు ఇస్తారని ఆందోళన చెందుతున్న సమయంలో, ఆపద్బాంధవిలా ఆయన చెల్లి గౌతమ్మ(26) ముందుకొచ్చారు. పూర్తి ఆరోగ్యంగా ఉన్న ఆమె తనకున్న రెండు మూత్రపిండాల్లో ఒకదాన్ని తన అన్నకు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. అన్నీ సరిపోవడంతో 2021 సెప్టెంబర్ నెలలో వైద్యులు ఇద్దరికీ శస్త్రచికిత్స చేసి మూత్రపిండాన్ని మార్చారు. దాంతో వీరభద్ర ప్రాణాలు కాపాడినట్లయింది. తోడబుట్టిన అన్న చిన్నప్పటినుంచి తనను ఎంతో ప్రేమగా చూసుకుంటాడని, అలాంటి అన్న కోసం ఒక మూత్రపిండం ఇవ్వడం తనకెంతో సంతోషంగా ఉందని గౌతమ్మ చెప్పారు. కిడ్నీ మార్పిడి తర్వాత అన్నాచెల్లెళ్లు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండడం సంతోషాన్ని ఇస్తోందని కిమ్స్ సవీర వైద్యులు నెఫ్రాలజిస్ట్ డా॥బదరీనాథ్, యూరాలజిస్ట్ డా॥దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.



క్రీడాకారులతో పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ గౌతమి

# ప్రతిభకలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహం

**కలెక్టర్ ఎం.గౌతమి**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

క్రీడల్లో ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకల్లో నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్ తో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభ ఉంటే ప్రోత్సాహం మనల్ని వెతుక్కుంటూ వస్తుందని చెప్పారు. క్రీడాకారుల్లో పోరాటపటిమ ఎక్కువగా ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడలకూ ప్రాముఖ్యతను ఇస్తూ వాటిలో పాల్గొనాలని సూచించారు. ప్రతిభ ఉండి అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. తల్లిదండ్రులు, వారి కోచ్‌లకు మంచి పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తదనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఈవీఎం గోడౌన్లు తనిఖీ**

అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ ఎం.గౌతమి తనిఖీ చేశారు. డిఆర్ఒ గాయత్రీదేవి, ఆర్డీవో మధుసూదన్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేశారు. జిల్లాకు కొత్తగా 12,570 బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్స్ కేటగిరీలో ఈవీఎంలను కేటాయించినట్లు చెప్పారు. భద్రపరిచిన పాత ఈవీఎంలను హైదరాబాద్, ఘజియాబాద్‌కు తరలించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, ఈడిటి దివాకర్ బాబు, పాల్గొన్నారు.

# తెలుగుభాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి

**కలెక్టర్ ఎం.గౌతమి**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**



గిడుగు వెంకట రామమూర్తికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

తెలుగు వాడుకభాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం ఏర్పాటులో గిడుగు వెంకట రామమూర్తి చేసిన కృషి ఎనలేనిదని చెప్పారు. ఏ కొందరికో పరిమితమైన చదువు వ్యవహారిక భాషలో సాగి అందరికీ అందుబాటులో రావడంలో గిడుగు చేపట్టిన అక్షర ఉద్యమం మరచిపోలేనిదన్నారు. వ్యవహారిక భాష ఉద్యమానికి మూల పురుషుడిగా, బహుభాషా శాస్త్రవేత్తగా, చరిత్రకారుడిగా, సంఘసంస్కర్తగా గిడుగు రామమూర్తి నిలిచారని కొనియాడారు. తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, ఫిషరీస్ డిడి శాంతి, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# విద్యార్థినిని కొట్టడం దారుణం

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని భావన స్కూల్లో చదువుతున్న 1 ఒకటవ తరగతి విద్యార్థి బాబును కొట్టిన టీచర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కొట్రేష్, కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థిని కొట్టిన విషయం తెలుసుకుని విద్యార్థి సంఘాల నాయకులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని పరామర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఓ టీచర్ విద్యార్థి బాబును కొట్టడంతో భయాందోళనకు గురై జ్వరం, వాంతులు అయ్యాయన్నారు. అంతేగాకుండా సంబంధిత విద్యార్థికి గుండె సమస్యలు కూడా ఉన్నాయన్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. విద్యార్థి వైద్యానికి అయ్యే ఖర్చును పాఠశాల యాజమాన్యం భరించడంతోపాటు వెంటనే టీచర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ నాయకులు అనిల్, లోకేష్, వీరేష్, తేజ, మనోజ్, విష్ణు, వంశీ, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు 'సందర్భం' చర్చావేదిక

**అనంతపురం** : జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో 'కరువు నుంచి బయటపడటం ఎలా..?' అన్న అంశంపై 'సందర్భం'లో చర్చ జరుగనున్నట్టు సందర్భ బృందం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ఎన్జీవో హోంలో చర్చ జరుగనుంది. రిటైర్డు జర్నలిస్టు సుసర్ల రమేష్ అధ్యక్షతన ఈ సమన్వయ సమాలోచన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ నిపుణులు, సిపిఎం, సిపిఐ, వైసిపి, బిజెపి తదితర పార్టీల నాయకుల పాల్గొంటున్నారు. ఈ ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగాన్ని ఏ రకంగా ఆదుకోవాలన్న అంశంపై చర్చ జరుగనుంది. ఈ కార్యక్రమంలో రైతు శ్రేయోభిలాషులు, అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# సిఎం గారూ..కార్మికుల వేతనాలకూ బటన్ నొక్కండి..

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప**

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

ముఖ్యమంత్రి జగన్ గారూ.. జిల్లాలోని శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల కార్మికుల బకాయి వేతనాలు చెల్లించేందుకు బటన్ నొక్కండి' అంటూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి మంచినీటి పథకాల్లో పని చేసే కార్మికులకు నెలల తరబడి వేతన బకాయిలు, పిఎఫ్ బకాయిలు చెల్లించలేదన్నారు. కేవలం కార్మికులు ఆందోళన చేసినప్పుడు మాత్రం కంటి తుడుపు చర్య తప్ప శాశ్వత పరిష్కారం చేయడం లేదన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేకమార్లు వినతిపత్రంలు, నిరసనలు తెలిపినా పట్టించుకోలేదన్నారు. తాగునీటి పథకాల కార్మికుల సంక్షేమం జిల్లా ప్రజా ప్రతినిధులకు పట్టడం లేదన్నారు. శాశ్వత పనులు చేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చేసిన పనికి వేతనం కోసం రోడ్లు ఎక్కాల్సిన దుస్థితి ప్రభుత్వాలు కల్పించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను విరివింపజేయాలని చెప్పడం దుర్మార్గంగా ఉందన్నారు. సమస్య పరిష్కరించాకే సమ్మె విరమిస్తారన్నారు. అలాకాదని బలవంతంగా సమ్మె విఫలం చేయాలని చూస్తే కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పారిశుధ్యానికి ముగ్గురు బాసులు..!




## కార్పొరేషన్ అధికారి నిర్ణయంపై ఉద్యోగుల పెదవివిరుపు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

సాధారణంగా ఏ మున్సిపాల్టీ, కార్పొరేషన్‌లో అయినా విభాగానికి ఒక్కరే అధిపతి ఉంటారు. ఆయన పర్యవేక్షణలోనే విభాగానికి సంబంధించిన పనులు జరుగుతుంటాయి. అయితే అనంతపురం కార్పొరేషన్‌లో మాత్రం ఇందుకు విరుద్ధంగా పరిస్థితి ఉంది. నగరంలో పారిశుధ్య పనులు మెరుగుపరచడం, ప్రజారోగ్య విభాగానికి ముగ్గురు బాసులు ఉన్నారు. ప్రజారోగ్య విభాగానికి హెల్త్ ఆఫీసర్ అధిపతిగా ఉంటారు. ఆయన పర్యవేక్షణలోనే నగరంలోని పారిశుధ్య పనులు, జనన మరణ రిజిస్ట్రేషన్ పర్యవేక్షణ జరుగుతుంటాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఫాగింగ్, వ్యాక్సినేషన్ తదితర పనులకు ప్రత్యేకించి వైద్య నిపుణులను నియమిస్తారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారి అధ్వానంగా తయారయ్యిందన్న ఫిర్యాదులు ప్రజల నుంచి వ్యక్తం అయ్యాయి. దీంతో పారిశుధ్య పనుల పర్యవేక్షణను కార్యదర్శి సంఘం శ్రీనివాసులుకు అప్పగించారు. గతంలో హెల్త్ ఆఫీసర్ పోస్ట్ ఖాళీగా ఉన్నప్పుడు సంఘం శ్రీనివాసులుకే పారిశుధ్య పనుల పర్యవేక్షణ బాధ్యత ఉండేది. పెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయ్యిఉండి హెల్త్ ఆఫీసర్ లేకపోవడంతో పట్టుబట్టి ఆ పోస్టును కమిషనర్ భాగ్యలక్ష్మి భర్తీ అయ్యేలా చర్యలు చేపట్టారు. ఎన్విరాన్మెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాంప్రసాద్ రెడ్డి స్థానంలో డిఇ శేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో వాహనాల మరమ్మతు, డీజిల్ వినియోగం తదితర అంశాలపై సభ్యుల అడిగిన ప్రశ్నలకు సంతప్తి చెందేలా సమాధానాలు ఇవ్వటంలో వారు విఫలం అయ్యారు. చెత్త తరలింపు వాహనాల నిర్వహణలో సమస్యలు తలెత్తడంతో తిరిగి ఎన్విరాన్మెంట్ ఇంజినీర్‌గా డిఇ రాంప్రసాద్ రెడ్డికే కమిషనర్ భాగ్యలక్ష్మి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్విరాన్మెంట్ ఇంజినీర్‌కు బాధ్యతలు తప్పించి ఇతరులకు అప్పగించడం... తిరిగి వారి నుంచి రాంప్రసాద్‌రెడ్డికి మళ్లీ బాధ్యతలు అప్పగిస్తూ అధికారి తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులే పెదవివిరుస్తున్నారు. ప్రస్తుత హెల్త్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డికి జననమరణ రిజిస్ట్రేషన్ పర్యవేక్షణ బాధ్యతలు, హెల్త్ అసిస్టెంట్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ పర్యవేక్షణ, జననమరణ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ పర్యవేక్షణ, వంకలు, మురుగు కాలువల్లో దోమల లార్వాల నివారణ, అవసరమైన సామగ్రి ఇంధనం వైద్య ఆరోగ్య శాఖ నుంచి తెప్పించటం వంటి పనులను కేటాయించారు. కార్యదర్శి సంఘం శ్రీనివాసులు వార్డు శానిటేషన్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ పర్యవేక్షణ, పారిశుధ్య పనుల నిర్వహణ, క్లాప్ పథకం అమలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, ప్లాస్టిక్ నియంత్రణను ఎన్విరాన్మెంట్ ఇంజినీర్‌తో కలిసి సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. వీధికుక్కలు, పశువుల నియంత్రణ, ట్రేడ్ లైసెన్స్ అతిసార, మెదడు వాపు వ్యాధి, డెంగీ, మలేరియా తదితర వ్యాధుల నిరోధానికై హెల్త్ ఆఫీసర్ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్‌తో కలిసి సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలి. ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రాంప్రసాద్ రెడ్డికి చెత్త సేకరణ, వేరుచేయడం, చెత్త తరలింపు వాహనాల నిర్వహణ, మరమ్మతులు, కంపోస్ట్ యార్డ్ నిర్వహణ, సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ తదితర అంశాలను ఆయనకు అప్పగించారు. ఇక సచివాలయాల పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు వార్డుల పర్యవేక్షణ, మస్టర్ తీసుకోవటం, కాలువల పూడికతీత పనులు చేయించాల్సి ఉంది. ఈ పనులను సదరు అధికారులు సరిగా చేయడం లేదనే విషయం అధికారుల తనిఖీల్లో తేలింది. నగరంలో పారిశుధ్యం అధ్వానంగా మారిందని స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యులు ఫిర్యాదులు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పారిశుధ్యం మెరుగనకు అధికారుల మార్పు, నియామకాలు మరింత గందరగోళాన్ని సృష్టించినట్లు అవుతోంది. ప్రజారోగ్య విభాగానికి ముగ్గురు అధిపతులను నియమిస్తూ కమిషనర్ భాగ్యలక్ష్మి చేపట్టిన చర్యలపై కార్పొరేషన్ అధికారుల్లోనే అసంతప్తి భావన నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కమిషనర్ ప్రజారోగ్య విభాగం పనితీరు మెరుగుపరచడానికి, నగరంలో పారిశుధ్యం పనుల్లో మార్పు తీసుకురావడానికి చేపట్టిన చర్యలు ఏ మేరకు సత్ఫలితాలు ఇస్తాయన్నది వేచిచూడాల్సి ఉంది.

# ప్రజా సమస్యలపై 'సమరభేరి'

## సిపిఎం ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల



రాయదుర్గంలో పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

అధిక ధరలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, జిల్లాలో ఎండుతున్న పంటలు, విద్యుత్ కోతలు తదితర సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నుంచి సమరభేరి నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున తెలిపారు. ఈమేరకు మంగళవారం రాయదుర్గంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద మోడీ ప్రభుత్వం ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారులకు దేశాన్ని దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఆఖరికి రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజలపై భారాలు వేసి ఆదాయాలను రాబట్టాలని ఆదేశాలు జారీ చేస్తోందన్నారు. ఇందుకు రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం సైతం తలొగ్గడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకూ వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ సహాయ కార్యదర్శి మధు, నాయకులు తిమ్మరాజు, హారూన్, సుభాన్, అశోక్, కృష్ణానాయక్, ఓబులేష్, గంగాధర, తిప్పేస్వామి, అశోక్, గణేష్, రామంజి, మంజు, మంజునాథ, నగేష్ పాల్గొన్నారు.

**గుత్తి :** ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి పోస్టర్లలను మంగళవారం గుత్తిలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల మండల కార్యదర్శి బి.రామకష్ణ మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్తు చార్జీలు వంట గ్యాస్ పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సమరభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి, మల్లిక, జయమ్మ, లక్ష్మీదేవి, సంజీవులు, బాలగిరి తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** పెరిగిన నిత్యావసర ధరలతోపాటు కరెంటు ఛార్జీలను తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కరెంటు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4వతేదీ వరకూ నిర్వహించనున్న నిరసనలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం మండలంలోని కడవకల్లు గ్రామం వైఎస్ఆర్ సర్కిల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ముఖ్యంగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారులకు దేశాన్ని దోచి పెడుతున్నారని ఆరోపించారు. ఆఖరికి రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజలపై భారాలు వేసి ఆదాయాలను రాబట్టాలని ఆదేశాలు జారీ చేస్తోందన్నారు. ఇందుకు రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం సైతం తలొగ్గడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, కొండా లక్ష్మీనారాయణ, అది, నారాయణస్వామి, గండి రాజు, చంద్ర పాల్గొన్నారు.



పుట్లూరు మండలంలో పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**నార్పల :** మండల కేంద్రంలోని క్రీడామైదానంలో హాకీ శిక్షకుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**శింగనమల :** మండలంలోని సోదనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే ఎంతో కష్టపడి కాకుండా ఇష్టంతో చదివాలని సూచించారు. అలాగే క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివేకానంద, మధుసూదన్‌రెడ్డి, పరిమళ, సురేష్, రాజేష్, హేమలత, రజినీకుమారి, రుక్మిణీదేవి, పిఇటి బైపిరెడ్డి పాల్గొన్నారు.

**పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు**

**ఉరవకొండ :** మండల పరిధిలోని అమిద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయురాలు జీవీ.నాగమంజుల, ఫిజికల్ డైరెక్టర్ ఈశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ గతేడాది ఫుట్‌బాల్, సెపక్‌తక్రా, ఖోఖో ఆటల్లో ఎక్కువ మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడమే కాకుండా ఫుట్‌బాల్, సెపక్‌తక్రా పోటీల్లో మొదటి స్థానం సాధించి 84 పాయింట్లు రావడంతో జిల్లాలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు క్రీడా ప్రతిభా వార్డులు ప్రదానం చేస్తారన్నారు. ఈ ఐదు పాఠశాలల్లో అమిద్యాలకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు తెలిపారు.

**బుక్కరాయసముద్రం :** 2022–2023లో పాఠశాలల నుంచి ఎక్కువ మంది రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్రీడాకారులు పతకాలు సాధించినందుకు మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలకు అవార్డు లభించింది. బుక్కరాయసముద్రం పాఠశాలకు జిల్లాస్థాయిలో 189 పాయింట్లు సాధించి వరుసగా మూడవ సంవత్సరం స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు వసుంధర తెలిపారు. ఈమేరకు ప్రధానోపాధ్యాయురాలితోపాటు పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మను పలువురు అభినందించారు.




బుక్కరాయసముద్రంలో పీడీ, ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

# ఆత్మకూరుకు చేరుకున్న సైకిల్ యాత్ర

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం ఆత్మకూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల సిపిఎం నాయకులు యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల విద్యార్థులు చదువుతున్న సంక్షేమ హస్టళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ప్రధానంగా మంచినీరు, నాణ్యమైన భోజనం, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలల నుంచి హాస్టళ్లకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. అలాగే హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా విద్యార్థులకు కనీసం పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, మధ్యాహ్న భోజనం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, ఆవాజ మండల నాయకులు వలి, విద్యార్థి సంఘం నాయకులు రజిత, సునీత, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, వైటిసి రమేష్, తరిమెల గిరి, శివ, భీమేష్, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

**ఘన స్వాగతం పలికిన సిపిఎం నాయకులు**



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి శివశంకర్

# అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిద్దాం : ఎమ్మెల్యే అనంత

**ప్రజాశక్తి-అనంతపురం**

వైసిపి అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని యాపిల్ గార్డెన్స్‌లో జేసీఎస్ సైన్యం యాప్‌పై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. అయితే టీడీపీ, బీజేపీ, జనసేన, ఇతర ప్రతిపక్షాలు ఓ వర్గం మీడియాను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లే వార్తలు రాయించడం, చూపించడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. ఐదేళ్ల టీడీపీ హయాంలో అభివృద్ధి, సంక్షేమం మూలనపడ్డాయన్నారు. దీంతోనే ప్రజలు తమకు అవకాశం కల్పించారన్నారు. కావున ప్రజలకు మనం చేస్తున్న మంచిని వివరించి ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, మేయర్ మహహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, లక్ష్మన్న, చింతకుంట మధు, వైసీపీ బీసీ విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ రమేష్ గౌడ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**IN THE COURT THE HON'BLE DISTRICT JUDGE, ANANTAPURAMU.**
**I.A.NO.704/2023 in A.S.No.Nil/2023**
**Between**
D.Khadar Vali Saheb **...petitioner/Appellant**
**And**
Pendekanti Krishna Murthy
**...Respondent/Respondent**
**Notice to Respondent**
To,
Pendekanti Krishna Murthy S/o Late P.Subbaiah, aged about 55 years, Hindu R/o at D.No:17-1-70, Venugopal Nagar, Ananthapuramu.
పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 08/09/2023 వ తేది నాడు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**
**V.BHARADWAJA PADMANABHA TEJA**
**ADVOCATE, ANANTHAPURAMU.**
**CELL:9700713342**

**In the Court of the Addl. Senior Civil Judge, Ananthapuramu**
**I.P.No.60/2021**
**Between:**
T.Ashok **...Petitioner**
**V/S**
1.P.Shamshad, 2.J.Venkataramudu
**...Respondents**
**Notice to Respondents**
To,
**R1:** P.Shamshad, W/o P.Munaf, D.No:7-4-150, Vengamanaidu Colony, Ananthapuramu.
**R2:** Jampala Venkataramudu, S/o J.Venkatappa, D.No:28-3-165, Sarada nagar, Ananthapuramu.
పైన కనబరచిన ఐ.పి.లో హాజరు నిమిత్తము ప్రతివాదులకు 05/09/2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు ఖుద్దున గానీ, లేక వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
**(కోర్టు ఉత్తర్వుల మేరకు)**
**అల్లు నారాయణప్ప,**
**అల్లు హరి నారాయణ**
అడ్వకేట్స్, అనంతపురం సెల్:9908616177

**మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**
**I.P.NO:10/2023**
**Between:**
బండారు సోమశేఖర్ **...పిటీషనర్**
V/S
1.అదుసుమిల్లి శ్రీనివాసులు నాయడు, 2.మార్తలా యోగానంద రెడ్డి, 3.ముచ్చుమర్రి నరేంద్ర, 4.వెల్లాల రామచంద్రారెడ్డి, 5.జి.మురళి, 6.మూలకాతల బాలగిరి రెడ్డి, 7.కొమ్మ ప్రసాద్ రెడ్డి, 8.దాబారా ప్రసాద్ బాబు, 9.పరిమి రమణ, 10.కె.కనదన్, 11.పనతమ్ గోపాల్ రెడ్డి, 12.నూకాలా నరేంద్ర, 13.బుద్దా రెడ్డి రవి కుమార్ రెడ్డి, 14.రామకృష్ణ, 15.దాబర శ్రీనివాసులు నాయుడు, 16.కె.రాజా, 17.మార్తలా వేణుగోపాల్ నాయుడు, 18.టి.సురేష్, 19.చాదువల అశ్వర్త రెడ్డి, 20.నారా రమేష్, 21.గన్ల్ల రాజా, 22.సిచన్‌మెట్ల విజయలక్ష్మి, 23.పత్తిపాటి క్రిష్ణయ్య, 24.యం.ఆది, 25.కె.వి.మునయ్య, 26.బొడెన్‌కకుంట్ల శేఖర్,27.మేడ సత్యం, 28.ఇండ్ల సాయి. 29.ముత్యాల మంజునాథ, 30.పి.చంద్ర, 31.వి.విజయ భాస్కర్ రెడ్డి, 32.పి.మురళి, 33.మూలకాతల శేషారెడ్డి.
**...రెస్పాండెంట్స్**
**పబ్లిక్ నోటీసు**
పై దావాలో పిటీషనర్ తనను దివాలా దారునిగా డిక్లేర్ చేయమని పై దావాను దాఖలు చేసి వున్నారు. పై దావా వాయిదా తేది:22/09/2023 వేయబడినది. పై దావాలో పిటీషనరును దివాలా దారునిగా డిక్లేర్ చేయుటకు ఎవరిపైన అభ్యంతరములు వున్నచో పై కోర్టు నందు వాయిదా తేది:22/09/2023 ఉదయం 10:30 గం॥లకు హాజరై తమ అభ్యంతరములు తెలుపుకోవచ్చును.
**(కోర్టు వారి ఆదేశాల మేరకు)**
వాయిదా తేది:22/09/2023
**యం.శ్రీనివాసులు, జి.విజయభాస్కర్,**
అడ్వకేట్లు, గుత్తి



ఓటరు సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

# ఓటరు సర్వే పరిశీలన

**గుత్తి :** పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఓటరు సర్వే కార్యక్రమాన్ని గుంతకల్లు ఆర్‌డిఒ, ఓటరు నమోదు అధికారి రవీంద్ర మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ ఓటరు జాబితాలో జరిగిన చేర్పులు, మార్పులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సరైన కారణాలు లేకుండా ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించరాదన్నారు. పగడ్బందీగా ఓటరు జాబితాపై విచారణ చేపట్టాలని బిఎల్‌ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఆర్ఐ సందీప్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివాహానికి ఆర్థికసాయం

**శింగనమల :** మండలంలోని సి.బండమీదపల్లికి చెందిన పల్లపు అలివేలమ్మ, సన్నప్పయ్య కుమారుడు ఆది వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి గంగాధర్, వాణిజ్య విభాగం కార్యదర్శి డేరంగుల శంకరయ్య, సోము, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయిట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

**అనంతపురం :** సాయిట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కోర్టు రోడ్డులోని వరదాంజనేయస్వామి ఆలయంలో గురుదేవులు సుందరదాస్, ఎంఎస్.రామారావుస్వామి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్, డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, మిస్సెస్ ఇండియా సుజనాచౌదరి, వరదాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు నగేష్‌చౌదరి, పివి.గోపాల్‌చౌదరి, శశికాంత్‌రెడ్డి, బాల రామయ్య, జి.రాజు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేసున్న సాయి ట్రస్టు సభ్యులు

# తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి-గుత్తి**

మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఎం.గౌతమికి వైసిపి నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, జిల్లా నాయకులు బి.రాజకుమార్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు నుంచి కృష్ణాజలాలను వైటీ చెరువు అక్కడ నుంచి గుత్తి చెరువును నింపాలన్నారు. గుత్తి చెరువు నిండితే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. సమ్మెలో ఉన్న సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు కార్మికుల బకాయి పడ్డ వేతనాలను చెల్లించాలని కోరారు. కార్మికుల సమ్మె విరమిస్తే వారు విధుల్లోకి చేరడం వల్ల గుత్తిలో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన పైపులు పాత కావడం వల్ల తరచూ ధ్వంసం అవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాల్మీకి శివ రాం, ఎన్.ఫారూఖ్, వి.వరదరాజులు, కెవి.రమణ, నరేష్, సచివాలయాల కన్వీనర్ ఎం.రంగస్వామి, వైసిపి నాయకులు బి.గురుప్రసాద్ యాదవ్, మార్తాడు ఆన్సర్, హమాలీ రామంజి, బింగి కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైసిపి నాయకులు



ఎపి ఎన్‌జీఓ నగర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డికి నోటీసు అందజేస్తున్న పోలీసు

# ఎన్‌జిఒ నగర అధ్యక్షుడికి పోలీసుల నోటీసు

**అనంతపురం :** సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ ఎపి సిపిఎసిఎ ఆధ్వర్యంలో వచ్చేనెల 1న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకూడదని ఎపి ఎన్‌జీఓ నగర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డికి పోలీసులు మంగళవారం నోటీసులు అందజేశారు. చలో విజయవాడ కార్యక్రమం ద్వారా శాంతిభద్రలకు భంగం కలిగే ప్రమాదం ఉన్నందున నోటీసులు అందజేసినట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు రక్త పరీక్షలు

**నార్పల :** మండల పరిధిలోని సిద్ధరాచర్ల గ్రామ పంచాయతీ దుర్గం పాఠశాలలో సర్పంచి రామాంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ రక్తం తక్కువ ఉన్న పిల్లలకి ప్రతి గురువారం ఐరన్ మాత్రలు పంపిణీ చేసి రక్తహీనతను తగ్గించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై పిల్లలకి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఫరీదాభాను, ఎంఎల్‌హెచ్‌పి అమృత, ఉపాధ్యాయులు ఇందిరమ్మ, రమేష్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్త వీర నారాయణమ్మ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పిల్లలపల్లి ఎంపియుపి పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్వయానా భోజనాన్ని తిని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారని ప్రధానోపాధ్యాయులు వన్నూరుస్వామిని అడగ్గా 153 మంది విద్యార్థులు ఉండగా 142 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగుందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, భాస్కర్‌రెడ్డి, ఉమాదేవి, సురేష్, నిర్మల, రామన్న, తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి చంద్రశేఖర్‌రెడ్డి

# నేరాలు ఘోరాలు

## మహిళ ఆత్మహత్య

**పుట్లూరు :** విషగులికలు మింగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండల పరిధిలోని దోసులేడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దోసలేడు గ్రామానికి చెందిన హేమలత (22) కడుపునొప్పి తాళలేక ఆదివారం విషగుళికలు మింగింది. గమణించిన బంధువులు వెంటనే తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం, అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. అయితే పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

## గుత్తిలో రెండిళ్లలో చోరీ

**గుత్తి :** పట్టణంలోని జంగాల కాలనీలో సోమవారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. కాలనికి చెందిన వార్డు వాలంటరీ రవికుమార్ పని నిమిత్తం నంద్యాలకు వెళ్లాడు. అతని ఇంటికి తాళాలు ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు వాటిని తొలగించి లోనికి ప్రవేశించారు. బీరువాను బద్దలు కొట్టి అందులోని రూ.లక్ష నగదు జత కమ్మలు ఎత్తుకెళ్లారు. అలాగే పని నిమిత్తం పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురంకు వెళ్లిన రంగనాయకులు ఇంటిలో దుండగులు చొరబడ్డారు. బీరువాలో ఉన్న రూ.50 వేలు నగదు, 3 తులాల బంగారు గొలుసు, జత బంగారు కమ్మలు, రెండు ఉంగరాలను అపహరించుకెళ్లారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. తురకపల్లి రోడ్డు లో ఉన్న నివాసాల వద్ద పార్కుచేసిన బైకులను దుండగులు చోరీ చేసుకువెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బీటెక్ బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశం

**అనంతపురం :** అనంతపురం జెఎన్‌టియు ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో ఉపకులపతి జి.రంగజనార్దన అధ్యక్షతన మంగళవారం 6వ బీ.టెక్ ప్రోగ్రాం బోర్డ్ ఆఫ్ స్టడీస్ కామన్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ బీ.టెక్ కోర్సు స్ట్రక్చర్ రివిజన్ కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆర్.23 రెగ్యులేషన్స్ గురించి చర్చించి కొంతమేరకు మార్పులు చేసినట్లు తెలిపారు. ఈ రెగ్యులేషన్స్‌లో హానర్స్ డిగ్రీ, రెగ్యులర్ డిగ్రీతో పాటు ప్రవేశ పెడుతున్నట్లు వివరించారు. ఈ డిగ్రీను పొందాలంటే అదనంగా 15 క్రెడిట్‌లను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డిఎపి సుమలత, బోర్డ్ అఫ్ స్టడీస్ ఛైర్మన్లు ఇసిఇ విభాగం నుంచి వి.సుమలత, సివిల్ విభాగం నుంచి ఆర్.భవాని, సిఎస్ఇ విభాగం నుంచి సి.శోభాబిందు, ఇఇఇ విభాగం నుంచి పి.సుజాత, మెకానికల్ విభాగం నుంచి వేణుగోపాల్‌రెడ్డి, మ్యాథ్స్ విభాగం నుంచి శంకరశేఖరరాజు, ఫిజిక్స్ విభాగం నుంచి త్యాగ రాజన్, కెమిస్ట్రీ విభాగం నుంచి జి.వి.సుబ్బారెడ్డి, ఇంగ్లీష్ విభాగం నుంచి వి.బి.చిత్ర, పరీక్షలు విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి, సభ్యులు భువనవిజయ, ప్రశాంతి, చెన్నారెడ్డి, మంజుల, పీఆర్‌ఓ యం.రామశేఖరరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## బీఫార్మసీ ఫలితాలు విడుదల

**అనంతపురము :** అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.ఫార్మసీ 3వ సంవత్సరం 1, 2వ సెమిస్టర్ (ఆర్.19) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

**పుట్లూరు :** మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థి మధుసూదన్‌రెడ్డి కుమారుడు ప్రణవ్‌తేజ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు మంగళవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అలాగే మిఠాయిలు పంచారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ, మల్లారెడ్డి, ఓబులేసు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు పల్లె ఉమ వర్థంతి

**అనంతపురం :** మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమా వర్థంతి కార్యక్రమంల్లో భాగంగా బుధవారం బాలాజీ, పివికెకె విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిశోర్ నేతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు, పల్లె అభిమానులు భారీగా తరలిరానున్నారు. ఇందులో భాగంగా రాప్తాడు హైవేలోని అశోక్ లైలాండ్ షోరూం సమీపంలోని పల్లె ఎస్టేట్‌లో పల్లె ఉమా ఘాట్‌ను పూలతో అలంకరించారు. కాగా నేడు అన్నదానం చేయనున్నారు.

## నీటి ఎద్దడి నివారణకు మందుల పిచికారీ

**పుట్లూరు :** వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి తదితర పంటలు నీటి ఎద్దడికి తట్టుకునేందుకు మందులు పిచికారి చేసుకోవాలని ఎఒ కాత్యాయిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పొటాషియం నైట్రేట్ (13:00:45) ఏ5 గ్రా లేదా (19:19:19) మూడు 19 ఎరువు లేదా యూరియా ఏ 10 గ్రా చొప్పున లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని కోరారు. అలాగే కంది, ఆముదం పంటల్లో కలుపు నివారణతో పాటు నేలకు ఆచ్ఛాధన కల్పించడం ద్వారా నేలలో తేమ శాతాన్ని రక్షించుకోవచ్చన్నారు.

## గ్రంథాలయం తనిఖీ

**గుత్తి :** పట్టణంలోని గ్రంథాలయాన్ని సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గ్రంథాలయంలోని రికార్డులు, పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠకుల కోసం పుస్తకాలను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులుకు ఆదేశించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఐటీ విభాగం అధ్యక్షుడికి సన్మానం

**గుత్తి :** వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డిని మంగళవారం పలువురు సన్మానించారు. స్థానిక పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గహంలో జెవివి ఉపాధ్యక్షుడు గురు శంకర్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గవ్వల కాశీరావు, జిల్లా నాయకుడు గవ్వల కోటేశ్వరరావులు రాజశేఖర్ రెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కరిడికొండ శివ, దేవేంద్ర,గాదిలింగ, తదితరులు పాల్గొన్నారు.

## కరిడికొండలో పంటపొలాల పరిశీలన

**గుత్తి :** మండలంలోని కరిడికొండ గ్రామంలో రైతులు సాగు చేసిన పంట పొలాలను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. వర్షాభావంతో పంటలు ఎండిపోవడంతో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆత్మా పీడీ మద్దిలేటి, ఎడిఎ (డిఆర్‌సి) శైలజ, గుత్తి ఎడిఎ ఎం.వెంకటరాముడు, రేకులకుంట పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు నటరాజ్, శ్రీనివాసులు, ఎఓ (డీఆర్సీ) శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సామగ్రి పంపిణీ

**యాడికి :** స్థానిక వైసిపి కార్యాలయంలో చేనేత కార్మికులకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేనేత సామగ్రిని పంపిణీ చేశారు. ఇందులో భాగంగా దాదాపు 11 మంది చేనేతలకు జాకాడ్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా తిరునాంపల్లి గ్రామానికి చెందిన తులశమ్మకు సిఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ జడ్పీటిసి వెన్నపూస, ఉపసర్పంచి కాసా చంద్రమోహన్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆహార సలహా కమిటీ సభ్యులు భాస్కర్‌కు అభినందనలు

**బుక్కరాయసముద్రం :** మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలోని జడ్పిటిసి ఛాంబర్‌లో నూతనంగా నియమితులైన ఆహార సలహా కమిటీ సభ్యులు, జడ్పిటిసి భాస్కర్‌ను 14 బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెద్దయ్య ఆధ్వర్యంలో పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. భాస్కర్‌కు ఇలాంటి పదవులు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాంభూపాల్, మాదన్న, వీరనారాయణ, మురళి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాష దినోత్సవం

**ప్రజాశక్తి-అనంతపురం**

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సప్తగిరి సర్కిల్ కూడలి మీదుగా టవర్‌క్లాక్ వరకు వెళ్లి, తెలుగు తల్లి విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా ఆగస్టు 8వతేదీన తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు నగరూరు రసూల్, అధ్యాపకులు ఎన్.ఓబిరెడ్డి, వి.ఫిరోజా, ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక ఆజాద్‌నగర్‌లోని నవభారత్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా పద్య పఠనం, గద్య పఠనం, వ్యాసరచన, వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నవభారత్ పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, ప్రధానోపాధ్యాయురాలు నిట్టూరు కృష్ణవేణి, నిట్టూరు అనిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలోని ఆదిమూర్తి నగర్, కోర్టురోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ బ్రాంచిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. ఇందులో భాగగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ శాంతా, జిల్లా కో ఆర్డినేటర్ తిరుమలేసు, అకడమిక్ డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి చంద్రకళ, ప్రీ-ప్రైమరీ ఇన్‌ఛార్జి బత్తులు, కోర్టు రోడ్డు బ్రాంచి ప్రిన్సిపాల్ తబస్సుం, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ఎఒ గోపాల్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు నీరజ, భారతి, తేజస్విని, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అలాగే వేమన ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యర్రగుంట్ల కృష్ణారెడ్డి అధ్యక్షతన తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ పద్యగాయకులు, లలితకళాపరిషత్ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య ఆలపించిన తెలుగు పద్యాలు, జానపదాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కుల సచివులు ఎం.వి లక్ష్మయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం సంయోజకులు జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, శ్రీసత్యసాయి ఉన్నత విద్యాసంస్థ తెలుగు సహాయ ఆచార్యులు యమునారాణి, ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ప్రముఖ కవులు షేక్ కంబదూరి నబీరసూల్, రియాజ్ అహ్మద్, క్రిష్ణవేణి, మధురశ్రీ, విశ్రాంత ఆచార్యులు రమణ, సామాజిక నిపుణులు కె.వి రమణ, వన్నూరు, రాహుల్, నాగ శేషారెడ్డి, గాయకులు సుధాకర్, ఫౌండేషన్ సభ్యులు భీమిరెడ్డి జానకి, షేక్ అబ్దుల్ జలీల్, లోకన్న, తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం కలెక్టరేట్ :** తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది రామాంజినమ్మ, కావేరి, శ్రీవిజయ, సరస్వతమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ, కస్తూరిబా పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రాయదుర్గం :** తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నియోజకవర్గంలోని డి.హీరేహాల్ మండలం హెచ్.సిద్దాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్ ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కాంతరాజు, రామాంజనేయులు, గిరిజాపతి, హనుమంతరాయప్ప, విశాలాక్షి, రాధాకుమారి, చెన్నవీరస్వామి, హనుమంతరాయుడు, తెలుగు భాషోపాధ్యాయులు రామాంజనేయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**రాయదుర్గం రూరల్ :** స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రఘు రామ్మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషాదినోత్సవం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తెలుగు వ్యాకరణంలో ప్రశ్నోత్తరాలు, పద్య పఠనం, సామెతలు, కథలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు శ్రీనివాసులు కిరణ్‌కుమార్, కోదండరాం, దేవదాసు, మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకృష్ణ, వాలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** మండల వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని స్థానిక శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, ఎంఇఒ మల్లారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పర్వతన్న, నాగరాజు, తదితరులు హాజరయ్యారు. అలాగే సన్‌రైజర్స్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో మాతృభాష తెలుగుకు వన్నెతెచ్చిన రచయిత, సంఘసంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి, జాతీయ క్రీడ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయ బృందం సంధ్య, శైలజ, నాగవేణి, రషీద, మమత, గౌతమి, భారతి, ఎం.శైలజ, ఇందుప్రియ, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు :** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దవడుగూరు ఉన్నత పాఠశాలలో బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత తెలుగు ఉపాధ్యాయుడు చిదంబరరెడ్డిని ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

**పెద్దపప్పూరు :** మండల వ్యాప్తంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో ఉన్న మౌర్య హైస్కూల్‌లో గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్కినేని ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శివ, శ్రీనివాసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలోని శ్రీచైతన్య పాఠశాలల్లో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు




పెద్దపప్పూరులోని మౌర్య పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు




అనంతపురంలోని నవభారత్‌పాఠశాల, రాయదుర్గంలోని పాఠశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి

## పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ అనంతపురానికి చెందిన రబియాబి తన భర్త హాజీపీరా వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు కవిన్ ఆదిత్య, సుబ్రమణ్యం, ఓబుళపతి, నబిరసూల్, కిష్టప్ప, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ

**ఉరవకొండ :** విడపనకల్ మండల పరిధిలోని కౌలు రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన సిసిఆర్‌సి కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ పద్మజ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిసిఆర్‌సి కార్డులు పొందిన 277 మంది కౌలు రైతులందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకులో క్రాప్‌లోన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా రైతులకు లోన్లు ఇవ్వాలని ఉరవకొండలోని ఎడిసిసి బ్యాంకుతోపాటు విడపనకల్ మండల పరిధిలో ఉన్న కెనరా, అనంత గ్రామీణ బ్యాంకుల మేనేజర్లకు సూచించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ మెర్సీ, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పంటకోత ప్రయోగాలపై శిక్షణ

**బెలుగుప్ప :** ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటనూ తప్పనిసరిగా నమోదు చేయడంతోపాటు పంటకోత ప్రయోగాలు చేయాలని తహశీల్దార్ ఓబులేసు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై విఆర్‌ఒలు, ఎంపిఇఒలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పంటకోత ప్రయోగాల కోసం సర్వే నెంబరును ఏవిధంగా గుర్తించాలి, పంటకోత ప్రయోగం ఎలా చేయాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్, ఎఎస్‌ఒ మమత, ఎఇఒ భాగ్య, మండలంలోని విఆర్‌ఒలు, గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు సర్వేపై సమీక్ష

**ఉరవకొండ :** ఓటరు జాబితా సర్వేపై మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒ శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని తమశీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి శంకరయ్య మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో మార్పులు, చేర్పులు చేసిన ఓటర్ లిస్టులతోపాటు మరణించిన వారి ఓట్లు తొలగించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ఆయా పార్టీలకు సంబంధించిన నాయకులు పాల్గొని సహకరించి సమస్యలు, అభ్యంతరాలు తెలపాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, జనసేన నాయకులు చంద్రశేఖర్, సిపిఐ నాయకులు చిన్నరాయుడు, బీఎస్పీ నాయకులు ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు ఓబులేసు, సోనియా సీనా, అబ్బాస్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 'సర్వేపల్లి' జయంతి ఉత్సవాలు

**అనంతపురం :** ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకూ భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు సుంకర రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఆర్ట్స్ కళాశాలలో రాధాకృష్ణ విగ్రహానికి పాలాభిషేకం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.